## కథ

# శ్రావణమాసం-శనగల మేళం

**అబ్బరాజు జయలక్ష్మి**

"ఏం శంకరం! ఏమిటి విశేషం! ఈ రోజు చాలా హుషారుగా కనిపిస్తున్నావే! మీ ఆవిడ పుట్టింటికి గాని వెళ్లిందా?" అంటూ పాత జోకొకటి వదిలి అది శంకరం దగ్గర పనిచేయకపోవడంతో తనే పెద్దగా నవ్వేశాడు పరమేశం.

అతనికి సమాధానం చెప్పే మూడ్ లేని శంకరం ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు. అతని సంతోషానికి కారణం భార్య పుట్టింటికి వెళ్లడం కాదు. పుట్టింటి నుండి వస్తున్నందుకు! అవును మరి! ఆషాఢమాసంలో కొత్త దంపతులు ఒక చోట ఉండరాదనే పాత సిద్ధాంతం ప్రకారం పుట్టింటికి వెళ్లింది ప్రియ. నిన్నటితో ఆషాఢం వెళ్లిపోయింది. ఈ రోజు ప్రియ భార్యామణి ప్రియ తిరిగి వస్తోంది. అందుకే అతని మనసు ఆనందంతో ఉరకలు వేస్తోంది.

"పెళ్లయి నాలుగు నెలలయింది. ఇంకా ఆషాఢమాసం పట్టింపు ఏమిటమ్మా" అన్నాడు శంకరం.

"నాలుగు నెలలు కాదు. ఏడాదిలోపు ఎప్పుడయినా ఆషాఢం పాటించవలసిందే" అంటూ ఆజ్ఞాపించింది శంకరం వాళ్ల అమ్మ.

ఫలితంగా ప్రియ పుట్టింటికి వెళ్లటం వలన ఈ నెల రోజులు అతికష్టం మీద దొర్లించాడు శంకరం. అందుకే ఇప్పుడు ప్రియ వస్తున్నందుకు ఆనందం!

* * *

"బ్రేక్‌ఫాస్ట్ రెడీ!" అంటూ పిలిచింది ప్రియ.

"అయామ్ ఆల్సో రెడీ!" అంటూ వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు శంకరం.

ప్లేట్‌లో వేడివేడిగా టిఫిన్ వడ్డించింది ప్రియ.

"ఏం టిఫిన్ చేశావు ప్రియా!"

"శనగల ఉప్మా!"

"శనగల ఉప్మానా! ఇదేమిటి చెప్మా! జీడిపప్పు ఉప్మా తెలుసు. గోధుమ రవ్వ ఉప్మా తెలుసు కానీ..."

"అబ్బా! తినండి! బాగుంటుంది"

'తినక తప్పుతుందా' అనుకుంటూ రవ్వ తక్కువ, శనగలు ఎక్కువగా ఉన్న ఆ పదార్థాన్ని స్పూనుతో తీసి నోట్లో పెట్టుకున్నాడు శంకరం.

"ఎలా ఉంది? బాగుందా?" అని ఉత్సాహంగా అడిగింది ప్రియ.

"ఆ...ఆ... బాగానే ఉంది" అంటూ ఎలాగో టిఫిన్ ముగించి లేచాడు.

ప్రియ వచ్చిన తరువాత శంకరం వాళ్ల అమ్మ తెలిసిన వాళ్లతో నెల రోజుల పాటు తీర్థయాత్రలకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. కొత్త దంపతులు కొన్నాళ్లు ఒంటరిగా, స్వేచ్ఛగా ఉండటానికి వీలుగా ఉంటుందని కూడా ఆమె ఆలోచన. ప్రియ, శంకరం యుగళగీతాలు ఆలపిస్తూ లైఫ్‌ని ఎంజాయ్ చేయటం మొదలుపెట్టారు.

ప్రియకు వంట సరిగా రాదు. పెళ్లికి ముందు అసలు వంట చేసిన పాపాన పోలేదు. పెళ్లయ్యాక అత్తగారే చేస్తున్నందున తనకు వంట చేయాల్సిన అవసరం రాలేదు. అందుకే తనకు తెలిసినది కొంత, విన్నది కొంత, కన్నది కొంత అన్నట్లుగా వంటింట్లో రోజుకొక ప్రయోగం చేస్తున్నది.

కొత్త పెళ్లాం! ఏమంటే ఏమో! అనవసరంగా బాధపెట్టినట్లవుతుందని మౌనంగా ఏం చేసినా తినేస్తున్నాడు శంకరం. అప్పుడప్పుడూ 'వంట చాలా బాగుంది. కానీ ఉప్పు కొంచెం తగ్గిస్తే బాగుంటుందేమో' అని, 'ఇంకొంచెం కారం వేస్తే కూర అదిరిపోతుంది' అని చెప్పీ చెప్పనట్లు లోపాలను చెప్తూ కాంప్లిమెంట్స్ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాడు.

కానీ ఇప్పుడు శ్రావణమాసం కదా! మంగళవారం నోములని, శుక్రవారం నోములని సుమారు ఇరవై ఇళ్లకు పేరంటాలకు వెళ్లి శనగలు మోసుకుంటూ ఇంటికి వస్తోంది. అత్తగారికి ఆ కాలనీ వాళ్లంతా బాగా పరిచయం ఉన్నందున పిలిచిన వారందరింటికీ వెళుతున్నది ప్రియ. ఇక ఇంటికి తెచ్చిన శనగలతో రోజుకో రకం వండిపెడుతోంది. శంకరం పని పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్లయింది. అసలే అంతంతమాత్రం వంట. ఇక శనగలతో రోజుకో రకం తయారీ.

తినటం చాలా కష్టంగా ఉంది శంకరానికి.

ఉండబట్టలేక శనగలు ఖర్చవ్వటానికి ఒక చిట్కా చెప్పాడు ప్రియకు.

"మనింటికి పిలిచినప్పుడు అందరికీ వాటిని పంచేసేయ్" అన్నాడు.

"ఇంకా నయం! అలా చేయటం తప్పు. నేను కూడా నాలుగు కిలోల శనగలు కొని నానబోస్తున్నాను. వాటినే మనింటికి వచ్చిన వాళ్లకు ఇస్తాను. లేకపోతే నోము ఫలితం ఉండదు. తెలుసా!" అన్నది ప్రియ.

'హతోస్మి!' అనుకున్నాడు శంకరం మనసులోనే.

* * *

"లంచ్ బాక్స్‌లో శనగల పాటోళి పెట్టాను తినండి" అంటూ ఆఫీసుకు వెళ్తున్న శంకరానికి బాక్స్ అందించింది ప్రియ.

లంచ్‌టైమ్‌లో సీట్లో నుండి లేవకుండా అలాగే కూర్చున్నాడు శంకరం.

"ఏవోయ్ శంకరం! బాక్స్ తెచ్చుకోలేదా ఇవాళ! రా! రా! నా బాక్స్ షేర్ చేసుకుందాం" అంటూ వచ్చాడు పరాంకుశం.

'బాక్స్ తెచ్చుకున్నాను' అంటే 'ఎందుకు తినటం లేదు?' అంటాడు అప్పుడు శనగల స్టోరీ అంతా చెప్పాలి అందుకని...

"అబ్బే! ఎందుకు! నేను కేంటిన్‌కు వెళదామనుకుంటున్నాను" అన్నాడు శంకరం.

"ఫరవాలేదు రావోయ్! అంత మొహమాటమెందుకు?" అంటూ పిలిచాడు పరాంకుశం. ఇక తప్పదన్నట్లు లేచాడు టిఫిన్ బాక్స్ మూతలో కొంచెం అన్నం, కూర పెట్టి శంకరం ముందుకు జరిపాడు.

ప్లేట్‌లోకి చూస్తూనే అదిరిపడ్డాడు శంకరం. అందులో అన్నంతో పాటు ఉన్నది వంకాయ కూర. కానీ అందులో వంకాయ ముక్కల కంటే శనగలే

కంటినిండా కనిపిస్తున్నాయి. తినలేక పారెయ్యలేక శంకరం పడిన పాట్లు ఆ దేవునికే ఎరుక.

ఆ రాత్రికి శనగల కుర్మా చేసింది ప్రియ. 'ఇదేం కర్మరా' అనుకున్నాడు శంకరం.

మర్నాడు ఆదివారం.

ఉదయం కమ్మగా ఏ ఇడ్లీలో, దోసెలో తింటే బాగుంటుందనుకుంటూ నిద్రలేచాడు.

వేడివేడి దోసెలు ప్లేట్లో పెట్టింది ప్రియ.

'హమ్మయ్య! దేవుడు నా మొర ఆలకించినట్లున్నాడు' అనుకుంటూ ముక్క తుంచి నోట్లో పెట్టుకున్నాడు.

టేస్టేదో తేడాగా ఉన్నట్లనిపించింది.

అనుమాన నివృత్తి కోసం "ప్రియా! ఇవేంటి మినపట్లా? పెసరట్లా?" అని అడిగాడు.

"అవేమీ కాదండీ! శనగట్టు. వెరైటీగా ఉంటుందని చేశాను. టేస్ట్ చాలా బాగుంది కదండీ!"

శంకరం తల అడ్డంగా తిప్పాడో, నిలువుగా తిప్పాడో అతనికే తెలీదు.


సాయంత్రం టిఫిన్‌గా శనగలు సాతాళించి పెట్టింది.

అలా వండిన రకం వండకుండా శనగలతో ఎన్ని రకాలుగా ఐటమ్స్ చేయవచ్చో అన్ని రకాలూ చేస్తోంది.

'శాడిస్టులా శనగల వంటలతో చంపేస్తోంది' అనుకున్నాడు శంకరం.

శనగలు తిని తిని నిద్రలో కూడా భూతద్దంలో నుండి చూసినట్లుగా పెద్ద పెద్ద ఆకారాలలో కుప్పలు తెప్పలుగా శనగలు దొర్లుకుంటూ తన మీదికి వస్తున్నట్లు, తను అందులో కూరుకుపోయి పైకి లేవలేకపోతున్నట్లు ఏవేవో కలలు వస్తున్నాయి శంకరానికి. ఇక కడుపులో అయితే కాంప్లెక్స్‌లు కూలుతున్నట్లుగా శబ్దాలు వినిపిస్తున్నాయి. ఈమధ్య ఉదయాన్నే జాగింగ్ చేయటం అలవాటుచేసుకున్నాడు శంకరం. ఉదర బాధలు తగ్గటానికి, ఉత్సాహంగా ఉండటానికి రోజూ జాగింగ్ చేయటం అవసరం అని నిర్ణయించుకున్నాడు.

★ ★ ★



ఆ రోజు జాగింగ్ నుండి వస్తుంటే వాళ్ల ఇంటికి నాలుగిళ్ల అవతల ఉన్న కమలమ్మగారు, ఆవిడ భర్త కామేశంగారు పలుకరించారు గుమ్మంలో నుండి.

"ఏమయ్యా శంకరం! ఏమిటి విశేషాలు? మీ అమ్మగారు ఎలా ఉన్నారట? యాత్రలు బాగా జరుగుతున్నాయటనా?" అని అడిగారు.

వాళ్లకు సమాధానం చెప్పి వెళ్లబోతుంటే-

"వెలుదువుగానీలే రావయ్యా లోపలకి" అంటూ చనువుగా పిలిచారు.

వయసులో పెద్దవాళ్లు. వాళ్ల మాట కాదనటం ఎందుకు? పది నిమిషాలు కూర్చుని వెళితే సరి అనుకుంటూ లోపలికి నడిచాడు.

"ఏమేవ్! శంకరానికి కూడా టిఫిన్ పట్రా" అన్నాడాయన.

"అబ్బే వద్దండీ" అన్నాడు బిడియపడుతూ.

కానీ 'టిఫిన్' అనగానే శంకరానికి నోట్లో నీళ్లూరాయి.

'ఆహా! ఎన్నాళ్లయింది కమ్మటి టిఫిన్ తిని. ఇవాళ వీళ్లింట్లో టిఫిన్ తినేసి వెళతాను' అనుకున్నాడు. మళ్లీ వెంటనే తనకు అలాంటి ఆలోచనలు వస్తున్నందుకు తనను తనే నిందించుకున్నాడు.

ఇంతలో కమలమ్మగారు రెండు ప్లేట్లు తెచ్చి వాళ్ల ముందర బల్లపై పెట్టారు. వాటి నిండుగా మొలకెత్తిన శనగలు, పచ్చి ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర కనిపిస్తున్నాయి.

"తీసుకోవోయ్! మా బ్రేక్‌ఫాస్ట్ ఇదే. ఆరోగ్యానికి మంచిది" అన్నారు కామేశంగారు.

శంకరానికి మూర్ఛ వచ్చినంత పనయింది.

ఈ జగమంతా శనగలమయంలా ఉంది. ప్రతివాళ్లూ 'శనగల ఉత్సవం' ఏదో జరుపుకుంటున్నట్లుగా ఉంది. లేకపోతే ఇలా అందరూ కట్టకట్టుకుని శనగలతో తన మీద దండయాత్ర ఎందుకు చేస్తున్నట్లు!

'బాబోయ్! పులి!' అన్నట్లు 'బాబోయ్! శనగలు!' అంటూ గావుకేక పెట్టి పైకి లేచి ఒక్క గెంతులో బయటపడి జాగింగ్ బదులు రన్నింగ్ రేసులో ఫస్ట్ వచ్చిన వాడిలాగా వచ్చి ఇంట్లో పడ్డాడు.

కమలమ్మగారికి, కామేశంగారికి ఏమీ అర్థం కాలేదు. "ఏదో అర్జెంటు పని గుర్తుకు వచ్చి ఉంటుంది పాపం" అనుకున్నారు.

"అమ్మయ్య! వచ్చేశారా! టిఫిన్ తిందురుగానీ రండి!" అన్నది ప్రియ శంకరాన్ని చూస్తూనే.

"ఏమిటది? శనగల టిఫినేనా?"

"భలే కనిపెట్టేశారే! ఈరోజు శనగలతో పరోటాలు చేశాను త్వరగా రండి. చల్లారిపోతున్నాయి"

"నేను రాను. ఈ రోజు నేను ఉపవాసం ఉందామనుకుంటున్నాను" అన్నాడు శంకరం.

"ఉపవాసమా! అది మీకు అలవాటు లేదుగదండీ!"

"ఈ రోజు ఎందుకో ఉండాలనిపిస్తోంది. నాకు లంచ్ బాక్స్ కూడా పెట్టకు"

"ఏమిటో! మీకు ఈ వెరైటీ పరోటాలు తినే ప్రాప్తం లేదు. ఏం చేస్తాం!" అంటూ నిట్టూర్చింది ప్రియ.

★ ★ ★

ఉపవాసం పేరుతో పొద్దున ఏం తినలేదు. ప్రియ ఇచ్చే లంచ్ బాక్స్ తెచ్చుకోలేదు. ఆకలి దంచేస్తోంది. పరాంకుశం కంటబడకుండా వెళ్లి కేంటిన్‌లో కూర్చున్నాడు.

ఆర్డరివ్వకముందే ప్లేట్‌లో ఒక పదార్థం తెచ్చిపెట్టాడు సర్వారాయుడు.

ఆ ప్లేట్లో అన్నీ కాబూలీ శనగలతో చేసిన ఆ పదార్థం పొగలు కక్కుతోంది.

"ఏమిటిది? నేను ఆర్డరివ్వలేదింకా" అన్నాడు శంకరం.

"చోలే బటోరా సార్! అదొక్కటే ఐటమ్ ఉంది సార్! అందుకే మీరు చెప్పకముందే తెచ్చాను" అంటూ పళ్లికిలించాడు వాడు.

'రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పదన్నట్లు ఇంట్లో శనగల ఎటాక్‌ను తప్పించుకుందామని ఇక్కడికి వస్తే ఇక్కడా అవే ప్రత్యక్షం కావాలా? తన బేడ్ లక్ కాకపోతే!'

"అవసరం లేదు" అంటూ టేబుల్ దగ్గర నుండి లేచాడు. అసలు తిండి మీదే విరక్తి పుట్టింది. కూల్ డ్రింక్ కొనుక్కుని తాగేసి వెళ్లి సీట్లో కూర్చున్నాడు.

ఆ రాత్రి పళ్లు, పాలు మాత్రం తీసుకుని ఆ రోజంతా నిజంగానే ఉపవాసం ఉన్నాడు శంకరం.

కానీ ఆ రాత్రి పూరీలు, ఇడ్లీలు, దోసెలు, బజ్జీలు... ఇంకా ఘుమ ఘుమలాడే రకరకాల వంటకాలన్నీ ప్రియ తన కోసం చేసినట్లు, అవన్నీ తను తృప్తిగా తిన్నట్లు కలగన్నాడు.

★ ★ ★

తెల్లవారుతూనే గుర్తొచ్చింది శంకరానికి శ్రావణ మాసం నిన్నటితో వెళ్లిపోయిందని.

'ఆహా! ఏమి నా భాగ్యం! భాద్రపద మాసం వచ్చేసింది. ఇక భయం లేదు. పేరంటాలు ఉండవు. శనగల మేళం ఉండదు' అనుకుంటూ హుషారుగా లేచి గది నుండి బయటికి వచ్చాడు.

ప్రియ ఎవరితోనో ఫోన్‌లో మట్లాడుతోంది-

"హలో! సుధా! అన్ని రకాలు చేశా కానీ 'శనగలతో శాండ్‌విచ్' ఎలా చేయాలో చెప్పవే. బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేయాలి!" అంటోంది.

పాపం! శంకరం! నోరు వెళ్లబెట్టి బొమ్మలా బిగుసుకుపోయాడు.



## మరీ బడాయి కదూ!

*నిత్యం సినిమా షూటింగులతో బిజీగా వుండే అశిన్‌కి ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా ఎడాపెడా కవితలు రాసిపారేస్తుందిట. తన 'థాట్స్'ని కాగితం మీద పెట్టి మురిసిపోవడం అశిన్‌కి బలే ఇష్టంట. అయితే మలయాళీ అయిన అశిన్ ఈ కవితల్ని ఇంగ్లీషు, ఫ్రెంచ్ భాషల్లోనే రాస్తుందిట. అదేంటీ అంటారా? పేరుకి అశిన్ కేరళ కుట్టే అయినా ఆమెకి మలయాళం రాయడం, చదవడం అస్సలు రాదట. ఇంగ్లీష్-ఫ్రెంచ్ భాషలు మాత్రం బ్రహ్మాండంగా వచ్చుట. మరీ బడాయిగా అనిపించడం లేదూ! ప్చ్!!*